నేడు జేఈఈ పేపర్-2 ఎగ్జామ్

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్ -1 పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. బుధవారం పేపర్ -2ఏ (బీఆర్క్), పేపర్ -2బీ (బీప్లానింగ్) పేపర్లకు పరీక్షలు నిర్వహిస్తారు. బీఆర్క్, బీ ప్లానింగ్‌కు 180 నిమిషాల చొప్పున పరీక్ష ఉంటుంది. ఈ రెండింటికి హాజరయ్యే అభ్యర్థులకు 210 నిమిషాల పాటు సమయాన్నిస్తారు. ఇక పేపర్-1 (బీఈ/ బీటెక్) పరీక్షలు ఈ నెల 27 ,29, 30, 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో జరుగుతాయి.

అక్రమంగా ఔషధాలు నిల్వ

స్వాధీనం చేసుకున్న డీసీఏ

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా నార్సింగిలో ఓ వ్యక్తి అక్రమంగా నిల్వ చేసిన ఔషధాలను డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్‌గా చెప్పుకొనే రాహుల్ కుమార్ శర్మ భారీగా మందులు నిల్వ చేసినట్టు అందిన సమాచారం మేరకు దాడులు చేశామని డీసీఏ డీజీ కమలాసన్ రెడ్డి తెలిపారు. 27 రకాల ఔషధాలను స్వాధీనం చేసుకొన్నామని, వీటి విలువ రూ.5 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. వీటితోపాటు వరంగల్ జిల్లా పరిధి ఖిలా వరంగల్‌లోని ఓ క్లినిక్‌లో అక్రమంగా నిల్వ చేసిన 40 రకాల మందులను స్వాధీనం చేసుకొన్నామని, వీటి విలువ రూ.80 వేల వరకు ఉంటుందని తెలిపారు. టీ రాజేందర్ అనే వ్యక్తి లైసెన్స్, సర్టిఫికెట్ లేకుండా ఈ క్లినిక్‌ను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

'ప్రధానమంత్రి విశ్వకర్మ' పై రేపు అవగాహన కార్యక్రమం

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంపై సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు కోవే తెలంగాణ చాప్టర్ సభ్యులు తెలిపారు. 18 వ్యాపారాలపై అవగాహన కల్పించనున్నట్టు వెల్లడించారు. కమ్మరి, సోనార్, ధోబీ, కుమ్మరి, టైలర్, బార్బర్, బోట్ మేకర్, టూల్ కిట్ మేకర్, శిల్పి, ఫిషింగ్ నెట్ మేకర్, డాల్, టాయ్ మేకర్, షూస్మిత్, మేసన్స్ తదితర వ్యాపారాల్లో ఎలా వృద్ధి సాధించాలి? పథకాన్ని ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలను వివరిస్తారని చెప్పారు. వివరాలకు 040351 62064ను సంప్రదించాలని కోరారు.

వీసీల నియామకానికి నేడు నోటిఫికేషన్!

- ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఆ తర్వాత సెర్చ్ కమిటీల నియామకం
- ప్రభుత్వ కసరత్తు ముమ్మరం

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని వర్సిటీలకు నూతన వైస్ చాన్స్‌లర్ల (వీసీ) నియామకానికి బుధవారం నోటిఫికేషన్ విడుదలకానున్నది. ఒకవేళ వీలుపడని పక్షంలో ఒకట్రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఇందుకు సంబంధించిన ఫైల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం సంతకం చేశారు. వెంటనే ఈ ఫైల్ విద్యాశాఖకు చేరింది. ఈ నేపథ్యంలో బుధవారం నోటిఫికేషన్ జారీకి విద్యాశాఖ వర్గాలు కసరత్తును తీవ్రతరం చేశాయి. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారు. తర్వాత దరఖాస్తులను పరిశీలిస్తారు. సవ్యంగా ఉన్న దరఖాస్తులను సెర్చ్ కమిటీకి పంపిస్తారు. సెర్చ్ కమిటీ ముగ్గురు ప్రొఫెసర్ల పేర్లను ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గవర్నర్‌కు పంపిస్తుంది. గవర్నర్ ఆమోదించిన తర్వాత ప్రభుత్వం వీసీలను నియమిస్తూ జీవో జారీచేస్తుంది. ఈ ప్రక్రియంతా మే మాసంలోపే పూర్తిచేసి, పాత వీసీలు వైదొలగగానే కొత్త వీసీలు బాధ్యతలు చేపట్టడం లక్ష్యంగా ప్రభుత్వం కసరత్తును తీవ్రతరం చేసింది.

మేతో ముగియనున్న గడువు

రాష్ట్రంలోని వర్సిటీల్లో బీఆర్ అంబేద్కర్, ఉస్మానియా, కాకతీయ, పాలమూరు, శాతవాహన, పొట్టి శ్రీరాములు తెలుగు, మహాత్మా గాంధీ, జేఎన్టీయూ, జేఎన్ఎఫ్ఏయూ వర్సిటీల వీసీల పదవీ కాలం ఈ ఏడాది మే నెలతో ముగుస్తుంది. ఇక అగ్రికల్చర్ వర్సిటీ వీసీ పదవీ కాలం ముగియగా, ప్రస్తుతం ఇన్‌చార్జ్ వీసీ కొసాగుతున్నారు. ఇక హార్టికల్చర్, వెటర్నరీ వర్సిటీ వీసీల కాలపరిమితి జనవరితో ముగియనున్నది. బాసర ఆర్జీయూకేటీకి ఇన్‌చార్జీ వీసీ కొనసాగుతున్నారు. ఇక తెలంగాణ వర్సిటీ వీసీ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడటంతో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఇన్‌చార్జీ వీసీగా వ్యవహరిస్తున్నారు. అటవీ విశ్వవిద్యాలయం, మహిళా వర్సిటీలు ఇటీవలే ఏర్పడటంతో వీటికి కొత్తగా వీసీలను నియమించాల్సి ఉండగా, ఈ రెండింటికి సెర్చ్ కమిటీతో నిమిత్తం లేకుండానే వీసీలను నియమించే వెసులుబాటు ఉన్నది.

సెర్చ్ కమిటీ స్వరూపమిలా..

వీసీల ఎంపిక ప్రక్రియను సెర్చ్ కమిటీలు చేపడుతాయి. యూజీసీ నిబంధనల ప్రకారం ఒక్కో వర్సిటీకి ముగ్గురితో సెర్చ్ కమిటీ ఏర్పడుతుంది. వీటిని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో జారీచేస్తుంది. ప్రభుత్వ నామిని, యూజీసీ చైర్మన్ నామిని, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) నామినీలతో ఈ సెర్చ్ కమిటీ ఏర్పడుతుంది. ఈ కమిటీ సమావేశమై అందరి బయోడేటాలను పరిశీలించి, ముగ్గురు పేర్లను వీసీగా నియమించేందుకు సూచిస్తారు. కనీసం ప్రొఫెసర్ 10 ఏండ్లుగా పనిచేసి ఉండాలి. లేదా పరిశోధన, అకడమిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పదేండ్ల అనుభవం కలిగి ఉండాలి. వీసీని మూడేండ్ల కాల పరిమితికి నియమిస్తారు. కాల పరిమితి ముగియగానే వైదొలగాల్సి ఉంటుంది.

కొత్తగా 11 ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలు

- కోస్గికి ప్రభుత్వ మహిళా ఇంజినీరింగ్ కళాశాల మంజూరు
- ప్రభుత్వం ముందు 10 కాలేజీల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- పాలిటెక్నిక్‌లనే ఇంజినీరింగ్ కాలేజీలుగా అప్‌గ్రేడ్

అప్‌గ్రేడ్ చేసే పాలిటెక్నిక్ కాలేజీలివే

- కులీకుతుబ్‌షాప్రభుత్వ పాలిటెక్నిక్ చందులాల్ బరాదరి, హైదరాబాద్.
- గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ మారేడుపల్లి
- ప్రభుత్వ పాలిటెక్నిక్ మాసాబ్‌ట్యాంక్
- గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ గచ్చిబౌలి
- ప్రభుత్వ పాలిటెక్నిక్ మహబూబ్‌నగర్
- ప్రభుత్వ పాలిటెక్నిక్ నల్లగొండ
- ప్రభుత్వ పాలిటెక్నిక్ వరంగల్
- ప్రభుత్వ పాలిటెక్నిక్ నిజామాబాద్
- ప్రభుత్వ పాలిటెక్నిక్ కొత్తగూడెం
- ఎస్‌జీ గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఆదిలాబాద్

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కొత్తగా 11 ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలు ఏర్పాటు కాబోతున్నాయి. వీటిలో ఇప్పటికే ఒక కాలేజీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీసింది. మరో 10 కాలేజీల ఏర్పాటు ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. ఈ 10 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలే కాగా, వీటిని ఇంజినీరింగ్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేస్తారు. ప్రతిపాదిత కాలేజీలన్నీ గతంలో సెకండిషిఫ్ట్ పాలిటెక్నిక్ కాలేజీలే కావడం గమనార్హం. ఈ కాలేజీల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పాలిటెక్నిక్ తరగతులు నిర్వహించేవారు. అడ్మిషన్లు కూడా వేర్వేరుగా ఉండేవి. అయితే ఈ కాలేజీల్లో రెండోషిఫ్ట్‌ను రద్దుచేసి, ఈ కాలేజీలను రోజంతా నిర్వహిస్తున్నారు. దీంతో ఆయా కాలేజీల్లో ఇన్‌టెక్ అలాగే ఉండగా, ఫ్యాకల్టీ ఆయా కాలేజీల్లోనే పనిచేస్తున్నారు. ఈ కాలేజీల్లో అధునాతన ల్యాబ్‌లున్నాయి. పీహెచ్‌డీ అర్హత ఉన్న ఫ్యాకల్టీ పనిచేస్తున్నారు. ఒక్క ఇంజినీరింగ్ కాలేజీకి సరిపోయే భవనాలను కట్టాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఇంజినీరింగ్ కాలేజీలుగా అప్‌గ్రేడ్‌చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. వీటిల్లో పాలిటెక్నిక్ కోర్సులతో పాటు, ఇంజినీరింగ్ కోర్సులను నిర్వహిస్తారు.

కోస్గిలో మహిళా ఇంజినీరింగ్ కాలేజీ

సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గికి ప్రభుత్వ మహిళా ఇంజినీరింగ్ కాలేజీ మంజూరైంది. కోస్గిలో నడుస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్‌ను ఇంజినీరింగ్ కాలేజీగా అప్‌గ్రేడ్‌చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఇది రాష్ట్రంలోని తొలి మహిళా ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ కావడం గమనార్హం.2024 -25 విద్యాసంవత్సరం నుంచి ఈ కాలేజీని ప్రారంభించనున్నారు. ఈ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (ఏఐఎంఎల్), కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (డాటాసైన్స్) కోర్సులను ప్రవేశపెట్టేందుకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఎస్సీఈఆర్టీలో డిప్యుటేషన్లు, ఓడీలు రద్దు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర విద్యాశాఖ శిక్షణా పరిశోధనా సంస్థ (ఎస్సీఈఆర్టీ)ను ప్రక్షాళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సంస్థలోని డిప్యుటేషన్లు, అన్‌డ్యూటీ (ఓడీ)లను రద్దుచేసింది. డిప్యుటేషన్‌పై రెండేండ్లు, అన్‌డ్యూటీపై ఏడాదికి పైగా పనిచేస్తున్న సిబ్బందిని ఆయా స్థానాల నుంచి తొలగించి వారి వారి పాత స్థానాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీచేశారు. డిప్యుటేషన్‌పై రెండేండ్లలోపు, ఓడీపై ఏడాదిలోపు ఉన్న వారికి మినహాయింపు ఇచ్చారు. దీంతో డిప్యుటేషన్లు, ఓడీలపై కొనసాగుతున్న 50 మంది ఉద్యోగులకు వేటు పడే అవకాశాలున్నాయి. భవిష్యత్తులో నోటిఫికేషన్‌నే ఉత్తర్వుల్లో సూచించారు.

ఎస్సీఈఆర్టీ నేరుగా పర్యవేక్షించరాదు

ఎస్సీఈఆర్టీ కార్యకలాపాలపైనా ప్రభుత్వం సమీక్షించింది, పలు సూచనలు జారీచేసింది. సంస్థ పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తంచేసి దిశానిర్దేశం చేసింది. ప్రాజెక్ట్‌లు, కార్యక్రమాలను ఇకనుంచి ఎస్సీఈఆర్టీ నేరుగా పర్యవేక్షించొద్దని ఆదేశించింది. విద్యా శిక్షణాకార్యక్రమాలు, మూల్యాంకనం, పరిశోధనలు, అధ్యయనాలు, మెటీరియల్ రూపకల్పనను ప్రభుత్వ నుంచి ముందుగా అనుమతి పొందాకే చేపట్టాలని సూచించింది. ఎస్సీఈఆర్టీ పరిశోధన, వనరులు సమకూర్చే సంస్థగా మాత్రమే సేవలందించాలని పేర్కొన్నది. ఈ ఆదేశాల అమలుపై ఫిబ్రవరి 1లోపు నివేదిక ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.

మహేంద్ర, లా ట్రోబ్ వర్సిటీల మధ్య ఒప్పందం

బేగంపేట్ జనవరి 23: మహేంద్ర వర్సిటీ, లా ట్రోబ్ వర్సిటీల మధ్య ఒప్పందాలు భారత్, ఆస్ట్రేలియా దేశాల మధ్య విద్యావకాశాలను మరింత పెంపొందిస్తాయని సౌత్ ఏషియా కమర్షియల్, సీనియర్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ డాక్టర్ మోనికా కెన్నెడీ అభిప్రాయపడ్డారు. సివిల్ ఇంజినీరింగ్ విద్య పరిశోధనలను విస్తృతం చేసేందుకు ఆస్ట్రేలియాలోని లా ట్రోబ్ వర్సిటీతో హైదరాబాద్‌లోని మహేంద్ర వర్సిటీ ఒప్పందం చేసుకొన్నది. బుధవారం బేగంపేట్‌లోని తాజ్ వివాంత హోటల్‌లో జరిగిన ఈ సమావేశంలో రెండు యూనివర్సిటీల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకొన్నారు. వర్చువల్‌గా హాజరైన మోనికా కెన్నెడీ మాట్లాడుతూ... భారతదేశం, ఆస్ట్రేలియా మధ్య వ్యూహాత్మక ఒప్పందం ఇరు దేశాల మధ్య విద్య సాంస్కృతిక సంబంధాలను మరింత మెరుగు పరుస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా పరిశోధనలపై సహకారం బలపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మహేంద్ర వర్సిటీ వీసీ డాక్టర్ యాజులు మేదురి, లాట్రోబ్ వర్సిటీ ఇంజినీరింగ్ విభాగాధిపతి హోస్సోమ్ అబుయెల్ నాగా తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నంబర్లకు 70 వేలు!

- లంచం డిమాండ్ చేసిన ఆర్వో, పంచాయతీ కార్యదర్శి, బిల్ కలెక్టర్లు
- రెండుచోట్ల ఏసీబీకి చిక్కిన సిబ్బంది

పట్టుబడిన అధికారులు నవంత్, గంగాధర్

నిర్మల్ అర్బన్/శంషాబాద్ రూరల్, జనవరి 23: ఇండ్లకు నంబర్లు కేటాయించేందుకు లంచం తీసుకుంటూ మంగళవారం మున్సిపల్, పంచాయతీ అధికారులు ఏసీబీకి పట్టుబడ్డారు. నిర్మల్ పట్టణంలోని ఏఎన్ రెడ్డి కాలనీకి చెందిన గోపాల్‌రెడ్డి 2023 జనవరిలో కట్టుకున్న ఇంటికి నంబర్ కోసం బిల్ కలెక్టర్ నవంత్, రెవెన్యూ అధికారి గంగాధర్ 10 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 3,500ను మంగళవారం ఇస్తుండగా వారిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొనికోర్టుకు తరలించారు.

రంగారెడ్డి జిల్లాలో కార్యదర్శి, బిల్‌కలెక్టర్..

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కూడ గ్రామ పంచాయతీ పరిధిలోని అమ్మపల్లి రెవెన్యూ పరిధిలో విద్యుత్తు శాఖ ఏఈ మధు కుటుంబ సభ్యులకు ప్లాట్లు ఉన్నాయి. వాటిలో నిర్మాణాలు చేసి ఇంటి నంబర్ల కోసం స్థానిక పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనర్సింహకు దరఖాస్తు చేసుకున్నారు. ఆయన సూచన మేరకు ఏఈ బిల్‌కలెక్టర్ నాగరాజును కలిస్తే 60 వేలు లంచం డిమాండ్ చేశాడు. మంగళవారం బాధితుడు మధు నర్కూడ కార్యదర్శి, బిల్ కలెక్టర్ నాగరాజుకు 45 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

'అయోధ్య'పై సైబర్ నేరగాళ్ల కన్ను

- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరికలు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): అయోధ్య రామమందిరం పేరును ఉపయోగించి జరిగే మోసాల పట్ల భక్తులు జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్, ఏడీజీ శిఖాగోయెల్ హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు క్యూఆర్ కోడ్లు, ఏపీకే ఫైల్స్ పంపి.. ప్రసాదం పంపిణీ చేస్తున్నట్టు, విరాళాలు సేకరిస్తున్నట్టు, దర్శనం కోసం వీఐపీపాస్‌లు ఇప్పిస్తున్నట్టు అమాయక భక్తుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారని తెలిపారు. నకిలీ వెబ్‌సైట్లను సృష్టించి, లింక్‌లు పంపి మోసగించే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల మాయలో పడితే.. 1930 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

14 కొత్త భరోసా కేంద్రాలపై సమీక్ష

కొత్తగా నిర్మితమవుతున్న 14 భరోసా కేంద్రాలపై రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ ఏడీజీ శిఖాగోయెల్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వాటి నిర్మాణ పనులను తెలుసుకొన్నారు. ప్రారంభానికి సిద్ధమవుతున్నట్టు అధికారులు వివరించారు. అత్యాచార బాధితులకు, ఆపదలో ఉన్న ఆడబిడ్డలకు ఈ భరోసా కేంద్రాలు 24 గంటలూ సాయం చేస్తాయని శిఖాగోయెల్ తెలిపారు.

ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పేరుతో నకిలీ వెబ్‌సైట్

విరాళాలు సేకరిస్తున్న రాజస్థాన్ సైబర్ చీటర్ అరెస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 23 (నమస్తే తెలంగాణ): ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సీ) పార్టీ పేరుతో నకిలీ వెబ్‌సైట్ రూపొందించి.. విరాళాలు సేకరిస్తున్న రాజస్థాన్‌కు చెందిన సైబర్ నేరగాడిని సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. జాయింట్ సీపీ, ఏవీ రంగనాథ్ కథనం ప్రకారం.. జైపూర్‌కు చెందిన సురేంద్రచౌదరి నేట్ ఐఎన్‌సీ.కో.ఇన్ అనే పేరుతో అసలైన వెబ్‌సైట్ (డొనేట్ఐఎన్‌సీ.నెట్) మాదిరిగా తయారు చేశాడు. దేశవ్యాప్తంగా పలువురు కాంగ్రెస్ కార్యకర్తలను మోసం చేశాడు. దీనిపై కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు 10న సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చే రాజస్థాన్‌లో నిందితుడిని అరెస్ట్ చేశారు.

పశుసంవర్ధకశాఖ అధికారి పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): గొర్రెల పెంపకం పథకం నిధుల మళ్లింపు కేసును కొట్టేయాలని కోరుతూ మేడ్చల్ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎం ఆదిత్య కేశవసాయి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. పోలీసులు నమోదు చేసిన కేసు ఏసీబీకి బదిలీ అయ్యిందని, పిటిషనర్‌పై వచ్చిన ఆరోపణల మీద విచారణ జరగాల్సి ఉన్నదని, ఈ దశలో పిటిషనర్‌కు అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేయలేమని కోర్టు స్పష్టం చేసింది. ఆదిత్య కేశవసాయి పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి విచారణ జరిపారు. గచ్చిబౌలి పోలీసు స్టేషన్‌లో డిసెంబర్ 28న కేసు నమోదైంది.